ప్రజాశక్తి
మంగళవారం 14 నవంబర్ 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

గాలి నాణ్యతకు దీపావళి దెబ్బ !

◆ నగరంలో 300 మార్క్‌ను దాటేసిన వాయు కాలుష్యం ◆ గతం కంటే అధికం
◆ నిర్ధారించిన కాలుష్య నియంత్రణ అధికారులు, పర్యావరణ వేత్తలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దీపావళి.. ఈసారి వెలుగులతో పాటు కాలుష్యాన్నీ భారీగానే తెచ్చినట్టు విశాఖ నగరంలోని గణాంకాలు రూఢీ చేస్తున్నాయి. ఎప్పటిలాగే ఈ ఏడాదీ భారీగానే దీపావళి మందుగుండు నగరంలో పేలింది. రూ. కోట్లలో క్రాకర్ల వ్యాపారం సాగింది. ఈ క్రమంలోనే వాయు కాలుష్యమూ పెరిగింది. వాయు నాణ్యత సూచీ (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్-ఎక్యుఐ) సోమవారం నాటికి 300 మార్కును దాటేసింది. ఆదివారం వరకూ 250 ఎక్యుఐ ఉండగా ఒక్కసారిగా ఇది అమాంతం పెరిగింది. గతంతో పోలిస్తే ఇది రెండు రెట్లు అధికమని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, పర్యావరణవేత్తలు చెబుతున్నారు. 2020లో కోవిడ్ కారణంగా ప్రజలు దీపావళిని క్రాకర్లు కాల్చకుండా దీపాలు అలంకరించి పండగ చేసుకున్నారు. అనంతరం 2021లో 130, 2022లో 240 ఎక్యుఐ నమోదైంది. ఇప్పుడు ఏకంగా ఆ సంఖ్య 300కు చేరిపోవడం పర్యావరణ పరంగా ఆందోళన కలిగించే అంశమే అవుతుంది. ఒక క్యూబిక్ మీటరుకు 60 మైక్రోగ్రాములు అనుమతించదగిన పరిమితి కాగా అంతకు మించి 456 మైక్రోగ్రాములకు తాజా దీపావళి చేర్చింది. ఆదివారం రాత్రి 8 గంటల నుంచి 11 గంటల మధ్య కాలుష్యం పెరిగింది. సోమవారం నాటికి పొగమంచు నగరాన్ని కప్పేసింది. దీని ప్రభావంతో సోమవారం గాలి నాణ్యత కూడా పడిపోయింది.

టపాసులు కాల్చడంతో దట్టంగా వెలువడుతున్న పొగ

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు ఏం చెబుతున్నాయి ?

పర్టిక్యులేట్ మ్యాటర్ (పిఎం) 2.5, పిఎం 10 మొదలైన వివిధ కాలుష్య కారకాలను సంగ్రహించడం ద్వారా మొత్తం ఎక్యుఐ లెక్కించబడుతోంది. దీని ప్రకారం సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇచ్చిన లెక్క చూస్తే.. 0 నుంచి 50 మధ్య ఎక్యుఐ ఉంటే గాలి నాణ్యంగా ఉన్నట్లు లెక్క. పర్వాలేదు అనిపించుకోవాలంటే 51 నుంచి 100 లోపు ఉండాలి. 101 నుంచి 200 వరకూ మధ్యస్తం అని అర్థం. 300 దాటితే ఇబ్బందికర పరిస్థితులే. ఇది దీర్ఘకాలం కొనసాగితే శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతుంది.

ఆంధ్రా యూనివర్శిటీ ఎన్విరాన్‌మెంట్ సైన్సెస్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ టి.బైరాగిరెడ్డి మాట్లాడుతూ క్రాకర్లు పేలడం వల్ల ఉత్పన్నమయ్యే కాలుష్యాలు పరిసరాల్లోకి మిగతా 2లో..

అనకాపల్లిలో బైకు ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజా రక్షణ భేరికి తరలిరండి

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సిపిఎం విస్తృత ప్రచారం వార్త 8లో..

విశాఖ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రైల్వే బోర్డు అదనపు సభ్యురాలు (పర్యాటకం అండ్ క్యాటరింగ్), ఐఆర్‌సిటిసి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీమా కుమార్ సోమవారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, గతిశక్తి, డివిజన్, ఐఆర్‌సిటిసి సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. ఆమె స్టేషన్ రీడెవలప్‌మెంట్ మోడల్‌ను, విశాఖపట్నం రైల్వే స్టేషన్ రీడెవలప్‌మెంట్ పనుల లేఅవుట్ ప్లాన్‌ను చూసి భవిష్యత్తు ప్రణాళికను సమీక్షించారు. పునరాభివృద్ధి పని సమయంలో రైళ్ల కార్యకలాపాలకు అంతరాయం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రయాణికుల రాకపోకలు కొనసాగించాలని సూచించారు.

15న జివిఎంసి స్టాండింగ్ కమిటీ సమావేశం

▶ వార్త 2లో..

ఇళ్ల స్థలాల జిఓను సవరించండి

▶ వార్త 2లో..

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

▶ వార్త 2లో..

మద్దిలపాలెంలో జరిగిన వర్ధంతి సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ఎవి.రమణరావుకు నివాళి

పలుచోట్ల వర్ధంతి సభలు వార్త 6లో..

భారత్ - ఆసీస్ /టి 20 టికెట్లు అమ్మకానికి ఏర్పాట్లు

- 15, 16న పేటీఎం ద్వారా, 17, 18న ఆఫ్‌లైన్‌లో విక్రయం

ప్రజాశక్తి - పిఎం.పాలెం : విశాఖపట్నంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 23న జరిగే ఇండియా, ఆస్ట్రేలియా టి - 20 అంతర్జాతీయ మ్యాచ్ కోసం 15, 16 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి పేటీఎం (insider.in) లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో టిక్కెట్లు విక్రయించనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్‌రెడ్డి వెల్లడించారు. అదే విధంగా 17, 18 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి విశాఖపట్నంలోని పిఎం.పాలెంలో ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలోని 'బి' గ్రౌండ్, వన్‌టౌన్‌లో ఉన్న ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం, గాజువాక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా ఆఫ్‌లైన్‌లో టిక్కెట్లు విక్రయిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు చేసిన వారు ఆయా కౌంటర్లలో 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు రెడీమ్ చేసుకోవచ్చునని వెల్లడించారు. రూ.600, రూ.1500, రూ.2000, రూ.3000, రూ.3500, రూ.6000, విలువగల టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.



భారత్ - ఆసీస్ మ్యాచ్ జరిగే పిఎం.పాలెంలోని ఎసిఎ విడిసిఎ స్టేడియం

ప్రపంచ కప్
సెమీ ఫైనల్ వీక్షించేందుకు బిగ్ స్క్రీన్లు

భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగే ప్రపంచ కప్ సెమీఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

గాలి నాణ్యతకు దీపావళి దెబ్బ !

వెదజల్లడానికి ఒకటి లేదా రెండు రోజులు పడుతుందన్నారు. శీతాకాలం కాబట్టి గాలి దట్టంగా మారడం దీనికి కారణమని అంటున్నారు. ఇది విలోమ ప్రభావాన్ని చూపించనుందని అభిప్రాయపడ్డారు.

వైజాగ్ ర్యాంక్ ఎక్కడ ?

నిర్దేశిత కాలుష్య ప్రమాణాలకు అనుగుణంగా లేని నగరాల్లో వైజాగ్‌ను ఇదివరకే కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గుర్తించింది. నగరంలో కాలుష్య స్థాయిలను నియంత్రించేందుకు సిపిసిబికి విశాఖ నగర ప్రణాళిక కూడా ఇదివరకే ఇవ్వబడింది. ప్రస్తుత దీపావళి వెలుగులను తెచ్చినా కాలుష్యాన్ని భారీగా వెదజల్లిందని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

టి 20 టికెట్లు అమ్మకానికి ఏర్పాట్లు

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రాష్ట్రంలోని మూడు నగరాల్లో పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు గోపీనాథ్‌రెడ్డి వెల్లడించారు. అందులో భాగంగా వైజాగ్ ఆర్కే బీచ్ వద్ద కాళీ మాత టెంపుల్ ఎదురుగా, విజయవాడ ఎంజి రోడ్డులో ఉన్న ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం, వైఎస్ఆర్ కడపలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లలో ఒక్కో చోట దాదాపు 10 వేల మంది వీక్షించేలా పెద్ద స్క్రీన్లను ఏర్పాటు చేశామని, అందులో ప్రవేశం ఉచితమని పేర్కొన్నారు. క్రికెట్ అభిమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో ఫుడ్ కౌంటర్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి -చీడికాడ: గ్రంథాలయ వార్షికోత్సవ వారోత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని గ్రంథాలయ అధికారిని ఎంఎస్ఎల్ జోగేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, గ్రంథాలయ వార్షికోత్సవాల సందర్భంగా ప్రాథమిక స్థాయి విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన , చిత్రలేఖనం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు 20వ తేదీన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం జరుగుతాయి అన్నారు. వారోత్సవాల్లో విద్యార్థుల అధిక సంఖ్యలో పాల్గొవలన్నారు

డిప్యూటీ సిఎం బూడికి ఆహ్వానం

దేవరాపల్లి : ఈనెల 14 నుంచి దేవరాపల్లిలో జరిగే గ్రంథాలయ వారోత్సవాలకు రావాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడును గ్రంథాలయ వారోత్సవాల కమిటీ సభ్యులు డాక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు ఆహ్వానించారు. ఈ మేరకు తారువ క్యాంపు కార్యాలయంలో మంత్రికి సోమవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో దేవరాపల్లి శాఖ గ్రంథాలయాధికారి ఓ.శ్రీనివాసరావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కెవి రమణ, వేచలపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి వి.ఆనంద్ తెలిపారు. జాతీయ నాయకులు, గ్రంథాలయ ఉద్యమానికి కృషి చేసిన ఉద్యమ నేతల సంస్మరణ ఉపన్యాసాలు, పుస్తక ప్రదర్శన, సభ్యత్వ నమోదు, చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ, పాటల పోటీలు ఉంటాయని, 20న ముంగింపు సభలో విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని పేర్కొన్నారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు వారో త్సవాలు నిర్వహించనున్నట్లు శాఖా గ్రంథాలయాధికారి ఎస్.మహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, ఆటల పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖ గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన, చిత్రలేఖన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు ముగింపు రోజున బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమాల వివరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయదేవి, పాత్రికేయులు ఎస్.చలపతిరావు, కె.సత్తిరాజు, టి.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

15న జివిఎంసి స్టాండింగ్ కమిటీ

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఈ నెల 15న ఉదయం 11 గంటలకు జివిఎంసి స్థాయీ సంఘం సమావేశం మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జివిఎంసి కార్యాలయంలో జరగనుంది. 23 అంశాల అజెండాపై స్థాయీ సంఘ సభ్యులు చర్చించనున్నారు. స్థాయీ సంఘం సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని మేయర్ తెలిపారు.

ఇళ్ల స్థలాల జిఒను సవరించండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ విడుదల చేసిన జిఒను సవరించాలని కోరుతూ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. జిఒ నెంబర్ 395/2023లో ఉన్న కొన్ని నిబంధనలు కారణంగా అత్యధిక శాతం మంది జర్నలిస్టులు ఎటువంటి లబ్ధీ పొందలేరని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. మంత్రి నివాసంలో సోమవారం ఆయనను కలిసిన సొసైటీ ప్రతినిధులు జిఒలో ఉన్న కొన్ని నిబంధనలను సడలించాలని కోరారు. ముఖ్యంగా జర్నలిస్టుల ఆర్థిక పరిస్థితి రీత్యా 60 : 40 ప్రాతిపదికన రూపొందించిన నిబంధనను అందరికీ అనువుగా ఉండేలా 90 :10 నిష్పత్తిలో చెల్లించేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలకు ఇచ్చిన నిబంధనలను పరిగణలోకి తీసుకొని ఇప్పుడు వాటిని వర్తింపజేయాలని కోరారు. గతంలో ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాలు పొందిన వారిని మినహాయించవచ్చని, కానీ భార్య పేరునగానీ భర్త పేరునగానీ ఇళ్ల స్థలం, ఫ్లాట్, ఇల్లు ఉంటే అనర్హులని ప్రకటించడం వల్ల ఎనభై శాతానికి పైగా జర్నలిస్టులు నష్టపోతారని వివరించారు. ఆ నిబంధనను తొలగించేలా కృషి చేయాలని కోరారు. 2023లో అక్రిడేషన్ లేని జర్నలిస్టులకు సీనియార్టీ ప్రాతిపదికన ఇళ్ల స్థలాల కేటాయింపునకు అర్హులుగా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల స్థలాల ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి వీలుగా దరఖాస్తు చేసుకునే సమయాన్ని ఆరు వారాల నుంచి మూడు వారాలకు తగ్గించాలని కోరారు.

మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ నాయకులు

విశాఖ నగరానికి దగ్గరలో, నివాసయోగ్యం ఉన్నచోట స్థలాల కేటాయింపు జరిగేలా చూడాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో 1/70 నిబంధన అమల్లో ఉన్నందున అక్కడ పనిచేస్తున్న జర్నలిస్టులకు ఎదురవుతున్న అడ్డంకుల నేపథ్యంలో మైదాన ప్రాంతాలలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని మంత్రిని కోరారు. సొసైటీ ప్రతినిధులు తీసుకువచ్చిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి అమర్‌నాథ్ హామీ ఇచ్చారు. సొసైటీ గౌరవాధ్యక్షులు జి.జనార్ధన్‌రావు, అధ్యక్షులు బి.రవికాంత్, సహాయ కార్యదర్శులు ఎం.చిట్టిబాబు, పి.శ్రీనివాసరావు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

నేడు మద్దిలపాలెంలో నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం మద్దిలపాలెంలో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన మద్దిలపాలెం సిఎంఆర్ సెంటర్ ప్రాంగణంలో ఉచిత డయాబెటిక్ రెటినోపతీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫౌండేషన్ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు 30 సంవత్సరాల పైబడిన వారందరికీ ఉచితంగా సుగర్ పరీక్షలు చేస్తామని, మధుమేహం అధికంగా ఉన్న వారి రెటీనాకు ఫొటో తీయడం ద్వారా వారిలో ఏదైనా కంటిచూపునకు సంబంధించిన సమస్యలు ఉంటే తగిన సలహాలు అందిస్తామని చెప్పారు.

పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి సాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రతి నెలా నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమంలో.. వివిధ ఆరోగ్య సమస్యలతో.. ఆర్థిక సాయం కోరుతూ వచ్చిన అర్జీలను పరిశీలించి తొమ్మిది మందికి రూ.40 వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అందజేశారు. సోమవారం వారి వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి ఆ మొత్తాలను అందించారు. ఆర్థిక సాయం పొందిన వారిలో 38వ వార్డు బొక్క వీధికి చెందిన గుంటు సత్యవతి, గొరక ఎల్లాజీరావు, 39వ వార్డు తాంమ్‌సన్ స్ట్రీట్‌కు చెందిన కురుమన రెడ్డి, 38వ వార్డు కందుల వారి వీధికి చెందిన బుంగ సత్తిరాజు, 37వ వార్డు చంగళరావు పేటకు చెందిన వాసుపల్లి దివ్య అంజలి, 33వ వార్డు అమ్మవారి వీధికి చెందిన మద్ది శంకర్ రెడ్డి, వివేకానంద కాలనీకి చెందిన నీలాపు వాసంతి, 27వ వార్డుకు చెందిన తనకాల అప్పల శ్రీనివాస్, 27వ వార్డు అశోక్ నగర్‌కు చెందిన కె.ఉదయ ఉన్నారు.

విజెఎఫ్ సభ్యత్వ రెన్యువల్ గడువు పొడిగింపు

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : వైజాగ్ జర్నలిస్ట్స్ ఫోరమ్ (విజెఎఫ్) సభ్యత్వ రెన్యువల్ గడువును జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మరో మూడు రోజులు పొడిగిస్తున్నట్టు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి బాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 సాయంత్రం ఐదు గంటల వరకూ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. మరోసారి గడువు పొడిగించబడదని స్పష్టం చేశారు. ఇప్పటివరకూ 430 మంది సభ్యులు రెన్యువల్ దరఖాస్తు సమర్పించారని తెలిపారు.

SUIT SUMMON

మహారాజశ్రీ కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.64/2020

Between :
Kotyada Ramana babu & 4 Others ...**Plaintiffs**
And :
Srinadhu Harinadh and 5 Others ...**Defendants**
To
Defendant : 1
Srinadhu Harinadh, S/o Kondala Rao, C/o Palakurthi Sunil, R/O Kotadibbalu, Durga Mess Back Side, Chodavaram village & Mandal, Anakapalli District.

దావా పరిహారం నిమిత్తం (ప్లెయింటు కాపీ జతపరచడమైనది) మీ మీద పైన వివరించిన వ్యాజ్యము వాది తెప్పించినందు వల్ల సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగా అందు వలన **2023వ సం॥ నవంబరు నెల 30వ తారీఖున పగలు 10-30 గంటలకు** స్వతహాగా లేక సరి అయిన భోగట్టా యివ్వబడిన వకీలుగారి ద్వారాగా లేక సరి అయిన ఏజంటు మూలముగా ఈ కోర్టులో హాజరయ్యేటట్లు యుందు వల్ల మీకు ఆజ్ఞాపించడమైనది, మీ ప్రతివాదమునకు ఆధారముగా వుద్దేశించి యుండే దస్తావేజులన్నింటినీ నీ యొక్క స్టేట్‌మెంటుతో సహా ఆ రోజు హాజరుపర్చుటకు మీకు ఉత్తరువు చేయడమైనది. పైన చెప్పబడిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పినయెడల మీ పరోక్షమందు పై వ్యాజ్యమును విమర్శన చేసి తీర్మానించుటమగునని మీరు తెలుసుకోవలసినది. తే.30-11-2023 దీన చేవ్రాలున్నూ, కోర్టు ముద్రయున్ను వెయ్యబడినది.

Sri. N.Sri Rama Murthy, Advocate, Kothavalasa, Vzm, Advocate for Plaintiff
B.O. Sheristdar
Ph.No.6305037955

IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM

E.P. 97/2018 in O.S. 822/2011

Between :
Kalla Polinaidu ...Decree Holder
And
1. Althi Narsayyama (Died)
2. Althi Ramu
3. Althi Narasinga Rao
4. Pilla Appala Narayanamma
5. Kolli Mangamma
6. Kondamala Ramadevi
7. Ayathi Nandini ...Judgment Debtors

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటీషన్‌లో డిక్రీ బాకీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తం పై జడ్జిమెంట్ డెటార్ల యొక్క ఈక్రింది షెడ్యూలు ఆస్థిని తేది. **30-11-2023**న వేలం వేయుటకు మహారాజశ్రీ కోర్టువారు ఉత్తర్వులు జారీచేసియున్నారు. కావున వేలం తేది. **30-11-2023** ఉదయం గం॥**10.30** ని॥ల నుండి **సా॥5.00**గం॥ల మధ్య సమయంలో వేలం వేయుదురు. సదరు వేలంపాటలో పాల్గొన దలచిన ఆసక్తి గలవారు పైతేదిన, పైతెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం షరతులకు లోబడి పాడుకొనవచ్చునని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

SCHEDULE OF PROPERTY

All that land in an extent of Ac. 0.52cents or 0.210 hectares in survey No. 140/1 of Gottipalli Village, Anandapuram Mandal, Anandapuram Sub-Registrar, Visakhapatnam District within the following boundaries.: **East**: Land belong to Palina Appanna, **South:** Road, **West:** land belongs to Tadpalli Sanyasi, **North:** Land belongs to Guntamni Pydithalli.

DHR Value : Rs. 7,00,000/-
Amin Value : Rs. 6,00,000/-
JDR Value : Not furnished

(By Order of the Hon'ble Court)
G. RAMACHANDRA RAJU, Advocate
Flat No. 1, # 13-2-11, Garuda Enclave, Anthony Nagar Road, Dandu Bazar, Visakhapatnam
Cell: 9440334813, 9440331750

పేరు మార్చబడినది

నేను, అద్దిపల్లి కుమార్ నాగరాజు (పాత పేరు) S/O అద్దేపల్లి అప్పారావు, D.NO:1-608, తుమ్మపాల వీధి, తుమ్మపాల గ్రామం, అనకాపల్లి జిల్లా. నా పేరును అద్దేపల్లి కుమార్ నాగరాజుగా మార్చుకున్నాను (కొత్త పేరు). ఇక నుండి నా పేరు అద్దేపల్లి కుమార్ నాగరాజు అని పిలుస్తారు.

ప్రకటన

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.A. No. 253/23, E.P. 4/2023
O.S. No. 113/2018

బిట్వీన్:
నీలపు సర్వేస్వరరెడ్డి ...**DHR**
అండ్
1. యన్నంరెడ్డి సూరిబాబు @ సూర్యారావు, S/o. పైడియ్య రెడ్డి, 65 సం॥లు, డోర్ నెం. 46-20-18, సీరపువారి వీధి, దొండపర్తి, విశాఖపట్నం, VZAGJCJ.
2. యన్నంరెడ్డి తారక వెంకట కిశోర్‌రెడ్డి, S/o. సూరిబాబు @ సూర్యారావు, 35 సం॥లు, సీరపువారి వీధి, దొండపర్తి, విశాఖపట్నం, VZAGJCJ. ...**J.D.R's**

పై నెంబర్ అమలు గ్రంథములో డిక్రీ హోల్డర్ బ్యాలన్స్ క్రియ ధనం కోర్టులో డిపాజిట్ నిమిత్తం పిటిషన్ దాఖలు చేసినందున శ్రీ కోర్టు వారు ఆర్డర్ ప్రకారం **ది. 16-11-2023 తేదీ పై కోర్టులో ఉదయం 10.30 గంటలకు** ఎదుట హాజరై మీ అభ్యంతరములు తెలియచేయవలెను. లేనియెడల మీకు వ్యతిరేకముగా తీర్పు చెప్పబడును.

బత్తిన లక్ష్మణదొర, అడ్వకేట్
పిఠాపురం, సెల్:9848184474

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

EP : 17/2023 OS : 354/2017

Between :
మనం సంజీవరావు ......డిక్రీ హోల్డర్
And :
ఆరిపాక నాగ సత్య జగన్‌మోహన్‌రావు ...జడ్జిమెంట్ డెటార్
To
శ్రీ ఆరిపాక నాగ సత్య జగన్‌మోహనరావు, S/o రామారావు, సెకండరీ గ్రేడ్ టీచర్, ఎంపిపి స్కూలు, ఎస్.కోట, తలారి (ఉసిరి), ఎస్.కోట మండలం, విజయనగరం జిల్లా.
నివాసము :- రామకృష్ణ మోడల్ హైస్కూల్ వెనుక, చైతన్య జూనియర్ కాలేజీ దగ్గర, శృంగవరపుకోట గ్రామము మరియు మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు కేసులో డిక్రీ హోల్డర్ మీ యొక్క షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ప్రథమ జప్తు మరియు నోటీసు కోరుచూ పై నెంబరు అమలు పిటిషను దాఖలు చేసి ఉన్నారు. అయితే కోర్టువారి ఉత్తర్వులు ప్రకారము మీ యొక్క ఆస్తి ప్రథమ జప్తు జరిగినది. కానీ అదే నెంబరు అమలు పిటిషన్‌లో మీకు నోటీసు పంపినప్పటికీ మీరు గ్రామములో లేరని తిరిగి వచ్చినందున, మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తము **తే 11-12-2023దీన ఉదయం 10-30 నిమిషములకు** వాయిదా అయి ఉన్నది. కనుక పై నెంబరు గల అమలు పిటిషన్‌లో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు స్వయముగా కానీ ప్లీడరు గారి ద్వారా గాని పై తేదీన పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. లేని యెడల సదరు అమలు పిటిషన్ మీ పరోక్షమందు తీర్మానించడము జరుగునని మీరు తెలుసుకోగలరు.

పి.హరగోపాల్
ఆర్.శ్రీనివాసన్
అడ్వకేట్స్, విజయనగరం

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM

O.S.1016/2021

Between:
CANARA BANK (erstwhile Syndicate Bank)
Visalakshi Nagar Branch,
Visakhapatnam, Rep. by its Branch Manager ...Plaintiff-Bank
And
M/s. Sri Sarada Medicals & 2 others ...Defendants

SUMMONS

To,
D-1: M/s.Sri Sarada Medicals,
Rep. by its Props. Sri. YHVS Muralidhar & Y Mrudula, S/o. late Y. Lokhanadham, D.No.5-286, Street No.6, Old Dairy Farm, Visakhapatnam-40.
D-2 : Sri. YHVS Muralidhar & Y Mrudula, S/o. late Y. Lokhanadham, Hindu, Aged about 46 years, Rest-do-
D-3:M.Nagaraju, S/o. late M. Lachanna, Hindu, Aged about 46 years, R/at D.No.16-73/1, Arilova Colony, Sector-5, Visakhapatnam-40.

Please take notice that the above-named plaintiff-Bank has instituted the above suit against all of you for recovery of an amount of **Rs.6,01,156-91ps** and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **15-11-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **15-11-2023** at **10:30 A.M** in the above Courtto answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
K. DAKSHINA MURTHY (K.D.M),
Advocate, Visakhapatnam.

క్రీడా మైదానాలేవీ?

క్రీడా మైదానం లేని జివిఎంసి పాఠశాల

- ఆట వస్తువుల్లేవు
- శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కరువు
- ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇదే దుస్థితి
- ఉన్న చోట నిర్వహణా లోపం

ప్రజాశక్తి -భీమునిపట్నం : పాఠమే పాటగా, చదువే ఒక ఆటగా, గురువే విద్యార్థికి చక్కని నేస్తంగా సాగితే విద్యార్థులు మంచి భావి భారత పౌరులుగా ఎదుగుతారని ఎందరో మహానుభావులు చెప్పేవారు. నేడు ఆ పరిస్థితి కానరావడంలేదు. విద్యార్థులకు ఆహ్లాదాన్ని అందించే క్రీడా మైదానాలు పలు పాఠశాలల్లో లేవు. అత్యధిక ప్రయివేట్ పాఠశాలల్లో ఎలాగూ లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం కనుమరుగవుతున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతంలో 22 ఉన్నత పాఠశాలలు ఉండగా కేవలం ఐదారు పాఠశాలల్లోనే క్రీడా మైదానాలు ఉన్నాయి. విద్యా శాఖ ప్రమాణాల ప్రకారం ప్రతి ఉన్నత పాఠశాలకు కనీసం 5 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఆట స్థలం ఉండాలి. కానీ మండలంలో ఎక్కడా ఆ పరిస్థితి లేదు. చిన్న పాటి స్థలంలోనే డ్రిల్ పీరియడ్‌ను అరగంట పాటు అలా కానిచ్చేస్తున్నారు. భీమిలి, చిట్టివలస, లక్ష్మీపురం, మజ్జివలస, తాటితూరు, తాళ్ళవలస, మజ్జిపేట, అమనాం, మంగమారిపేట, పట్టణ పరిధిలోని తగరపువలస, సంతపేట, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జివిఎంసి ఉన్నత పాఠశాలల్లో కొన్ని ఉన్నత పాఠశాలల్లో మాత్రమే ఆట స్థలాలు ఉన్నాయి. ఎపి బాలికల గురుకుల పాఠశాల, కెజిబివిలో, ప్రభుత్వ యాజమాన్యం కింద నడుస్తున్న సిబిఎం, సెయింట్ ఆన్స్ పాఠశాలల్లో విశాలమైన క్రీడా మైదానాలు ఉన్నాయి.

క్రీడా సామగ్రి కరువే...

దాదాపు అత్యధిక ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా సామగ్రి కరువనే చెప్పొచ్చు. ప్రభుత్వం క్రీడా సామగ్రిని సరఫరా చేయడం లేదు. కొన్ని పాఠశాలల్లో హెచ్‌ఎంలు, పిఇటిల చొరవతో, కొద్దిమంది దాతల సాయంతో క్రీడా సామగ్రి సమకూర్చుకుంటున్న పరిస్థితి ఉంది. క్రీడలపై తమకున్న ఆశక్తితో కొంత మంది విద్యార్థులు పలు క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ, ఆయా పాఠశాలలకు మంచి పేరు తెస్తున్నారు. వీరికి ప్రభుత్వ ప్రోత్సాహం తోడైతే మట్టిలో మాణిక్యాలుగా తయారయ్యే అవకాశముంది.

రాళ్లు, బురదమయంగా ఆనందపురం క్రీడామైదానం

రాళ్లు తేలి, బురదగా ఉన్న మైదానంలోనే ఆడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం రాళ్లు తేలి, బురదమయంగా ఉంటోంది. దీంతో విద్యార్థులు పలు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో సుమారు 1200 మంది విద్యార్థులు చదువుతున్నారు. బాలుర, బాలికల వసతి గృహాలు హైస్కూల్ సమీపంలోనే ఉన్నాయి. దీంతో విద్యార్థులు ప్రతిరోజూ ఈ క్రీడా మైదానంలోనే ఆడుకుంటున్నారు. వాకింగ్, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, క్రికెట్ తదితర ఆటలు ఆడుతుంటారు. పాఠశాల కొండవాలు ప్రాంతంలో ఉండడంతో వర్షానికి కోతకు గురై మైదానంలోకి రాళ్లు వస్తున్నాయి. విద్యార్థులు ఆడుకునే క్రమంలో కిందపడి రాళ్లతో గాయాలపాలవుతున్నారు. మైదానాన్ని పట్టించుకోకపోవడంతో చుట్టూ పిచ్చి మొక్కలు లేచాయి.

విద్యార్థులతో పాటు సమీపంలో ఉన్న యువకులు, ఉద్యోగస్తులు రోజూ ఉదయం పూట ఈ క్రీడా మైదానంలో వాకింగ్ చేస్తున్నారు. క్రీడా స్థలంలో ఉన్న రాళ్లు, పిచ్చి మొక్కలతో వీరు ఇబ్బందులు పడుతున్నారు. క్రీడా మైదానంలో వాకింగ్ ట్రాక్‌తో పాటు క్రీడా సామాగ్రిని ఏర్పాటుచేస్తే విద్యార్థులతో పాటు యువకులు, ఉద్యోగస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు, స్థానిక యువకులు పలుసార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. స్థానిక ప్రజా ప్రతినిధులు, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్పందించి ఈ క్రీడా మైదానం అభివృద్ధికి సహకరించాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

పలుచోట్ల అగ్నిప్రమాదాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

దీపావళి రోజున పలుచోట్ల అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

సీతమ్మధార : అక్కయ్యపాలెం సంఘం ఆఫీస్ ఏరియాలో సుగుణ సీతారామ్ అపార్ట్‌మెంట్ అయిదో అంతస్తులో మంటలు తీవ్రంగా వ్యాపించాయి. పక్కనే పెట్రోల్ బంక్ ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురై పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చిన మంటలను అదుపుచేశారు. ప్రాణ, ఆస్తి నష్టం ఏమీ జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పెదగంట్యాడ ఆటోనగర్‌లో...

గాజువాక : పెదగంట్యాడ ఆటోనగర్‌లోని ఎవరి గ్రీన్ కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగింది. కంపెనీ ఆవరణలో చెత్తాచెదారం ఉండడంతో దీపావళి నిప్పురవ్వలు పడి భారీ మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

పూరిల్లు దగ్ధం

వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో ఎలమంచిలి ఈశ్వరరావు పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లో ఉన్న వస్తువులు, దుస్తులు, పత్రాలు, నగదు కాలి బూడిదయ్యాయి. ప్రాణనష్టం లేదు. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేశారు. టిడిపి గ్రామ అధ్యక్షుడు దొండా నరేష్ సోమవారం కింద రూ.2000 ఆర్థిక సహాయం అందించారు. ఇంటి పునర్నిర్మాణంలో రేకులకయ్యే ఖర్చు తానే భరిస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దొండా గిరిబాబు, సింగంపల్లి రమేష్, అక్కిరెడ్డి కనక, గంగరాజు పాల్గొన్నారు.

మద్యం దుకాణానికి నిప్పు పెట్టిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- మధురవాడ : మద్యం దుకాణానికి నిప్పు పెట్టిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పిఎం పాలెం సిఐ వై.రామకృష్ణ తెలిపారు. దీనికి సంబంధించి సిఐ కథనం ప్రకారం... కొమ్మాది సాయిరాం కాలనీకి చెందిన గుమ్మడి మధు కొమ్మాది కూడలి వద్ద ఉన్న మద్యం దుకాణానికి ఆదివారం రాత్రి వెళ్లాడు. దుకాణంలో అతనికి కావలసిన బ్రాండ్ ఇవ్వలేదని కోపంతో వారితో గొడవపడి షాపుపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టాడు. ఈ ప్రమాదంలో సిబ్బందికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. దుకాణంలో ఉన్న పలు ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు కొన్ని మద్యం సీసాలు దగ్ధమయ్యాయి. సిబ్బంది పిఎం.పాలెం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కశింకోట : ఏలేరు కాలువలో కాలు జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని జమాదులపాలెం గ్రామానికి చెందిన కరక రామునాయుడు (57) శనివారం పశువులను మేతకు తీసుకువెళ్లి ఏలేరు కాలువలో వాటిని కడగటానికి దిగాడు. అనుకోకుండా కాలువలో మునిగిపోయాడు. అటుగా వెళుతున్న స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలియపరిచారు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని వెతకగా కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఏలేరు కాలువలో గాలించగా సోమవారం కసింకోట సమీపంలో మృతదేహం లభించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

ప్రజాశక్తి -ఆనందపురం: భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం, పద్మనాభం, భీమిలి రూరల్ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని విశాఖ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాదరావు పట్నాయక్ డిమాండ్ చేశారు. ఈ మూడు మండలాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు అన్ని పంటల్లోనూ తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పంటలు వేసిన రైతులు ఆ భారం మోయలేక చాలా బాధపడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కరువు మండలాలుగా ప్రకటించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కదగళ్ల నాగరాజు, సారిక ప్రకాష్, అనిల్ రాజు పాల్గొన్నారు.

శంకరరావు మృతికి సంతాపం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు, శ్రీనగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూరాకుల శంకరరావు మృతికి పలువురు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శంకరరావు ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇతని మృతికి కాంగ్రెస్ పార్టీ నాయకులు టి.రామదాసు సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. పార్టీలో ఆయన అనేక పదవులు నిర్వహించారని పేర్కొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌లో అర్హత సాధించేలా కృషి

ప్రజాశక్తి -తగరపువలస : ఎన్ఎంఎంఎస్‌లో ఉచిత శిక్షణ పొందుతున్న వారంతా ఉపకార వేతనం పొంది ఉన్నత స్థాయికి వెళ్లాలని సత్య సాయి సేవా సమితి కన్వీనర్ గొట్టిపల్లి సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో సోమవారం ఆయన మాట్లాడుతూ, ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యాన గత కొంతకాలంగా ఎన్ఎంఎంఎస్‌లో శిక్షణ ఇస్తుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పక్కి నాగేశ్వరరావు, సాయి, జి.చిన్నారావు, శివకుమార్, ఎం.సూర్యారావు పాల్గొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర కీలకం : ఎంపిపి


ఎంపిపి వాసురాజును సత్కరిస్తున్న ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి -తగరపువలస : ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమని భీమిలి ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణ రాజు (వాసు రాజు) అన్నారు. ఇటీవల స్థానికంగా ఏర్పాటైన ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఆయన అభినందించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో పాత్రికేయులు అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. ఎన్నో ఆటుపోట్లు, ఒడిదుడుకులు ఎదుర్కొంటూ పాత్రికేయ వృత్తిని కొనసాగిస్తున్న వారికి అభినందనలు తెలిపారు. అనంతరం సీనియర్ పాత్రికేయులను ఆయన సత్కరించారు. ఎంపిపిని పాత్రికేయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డిజె.మోహన్‌కుమార్, ఎల్.గణపతిరావు, ఉపాధ్యక్షులు జికె.జయంత్, కోశాధికారి బి.ఈశ్వర్‌కుమార్, సహాయ కార్యదర్శి రోజా, ఎగ్జిక్యూటివ్ మెంబర్ బి.ఆదిరాజు, సీనియర్ పాత్రికేయులు రంగ ధామారావు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజా పక్షం
ప్రజాశక్తి దినపత్రిక విలేకర్లు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన కేంద్రాల్లో విలేకర్లు కావలెను.

అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన

-: విలేకరులు కావలసిన ప్రాంతాలు :-

అగనంపూడి, కూర్మన్నపాలెం, పూర్ణామార్కెట్, వన్‌టౌన్, అల్లిపురం, సాగర్‌నగర్, డాబాగార్డెన్స్, మద్దిలపాలెం, సిరిపురం, ఎ.యు., క్రైం రిపోర్టర్, జిల్లా పరిషత్, రాంపురం, ఎన్ఏడి జంక్షన్, కంచరపాలెం, పెదగంట్యాడ, అనకాపల్లి రూరల్

ఇంటర్వ్యూ : తేది 14-11-2023 మంగళవారం ఉదయం 10 గంటలకు

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 94900 99125, 94915 70765

ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం : ప్లాట్ నెం.3 'జి' బ్లాక్, ఇండస్ట్రీయల్ పార్క్, వడ్లపూడి, ఆటోనగర్, విశాఖపట్నం-46

గుడి ముసుగులో వాణిజ్య సముదాయం!

గుడికి ఆనుకొని నిర్మిస్తున్న వాణిజ్య సముదాయం

ప్రజాశక్తి - ఆరిలోవ : గ్రీనరీ కోసం ఉంచిన జివిఎంసి స్థలంలో కొన్నేళ్ల క్రితం అనధికారికంగా దేవాలయం నిర్మించారు. దేవాలయం కదా అని అప్పట్లో ఎవరూ అడ్డంకి చెప్పలేదు. అది చాలక మరికొన్నేళ్లు ఆగి గుడిని ఆనుకొని ఒకవైపు మూడు షాపులు నిర్మించి అద్దెలకు ఇచ్చేసి సొమ్ములు చేసుకుంటున్నారు. ఇప్పుడు అదే దేవాలయాన్ని ఆనుకొని మరో వైపు జివిఎంసి స్థలాన్ని ఆక్రమించి వాణిజ్య సముదాయం నిర్మాణం చేపడుతున్నారు. 13వ వార్డు ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు సమీపంలోని వీర బ్రహ్మంగారి దేవాలయం ఆనుకొని ఇంత జరుగుతున్నా జివిఎంసి, సచివాలయం సిబ్బంది, టౌన్‌ప్లానింగ్ అధికారులు అభ్యంతరం చెప్పడంలేదు. పచ్చదనం కోసం ఉంచిన ఈ స్థలాన్ని కబ్జాచేసి అనధికార నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. భవిష్యత్‌లో సామాజిక అవసరాలు, పచ్చదనం పెంపొందించేందుకు ఉంచిన జివిఎంసి స్థలాలు కబ్జాకు గురవుతున్నా వార్డు కార్పొరేటర్ చూసీ చూడనట్టు వ్యవహరించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా వార్డు కార్పొరేటర్ అండదండలతోనే జరుగుతుందని చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ కబ్జాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యవసర సరుకులు అందిస్తున్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి -ములగాడ : రోడ్డు ప్రమాదానికి గురైన జివిఎంసి 40వ వార్డు ఎస్‌సి సెల్ ప్రెసిడెంట్ ఎకెసి కాలనీ – 1 సచివాలయ గృహసారధి పెంట్లా బాలకృష్ణకు వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు సహాయం అందించారు. బాలకృష్ణను సోమవారం ఆయన పరామర్శించి పాస్టర్ జీవన్ ద్వారా నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వరపల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కరాస: జివిఎంసి 52వ వార్డులో హెల్ప్ ద నీడీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దీపావళిని పురస్కరించుకుని పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. దోబీ కాలనీలోని పేదలకు, శాంతినగర్, సంజీవయ్యనగర్, అంబేద్కర్ నగర్, కరాస ప్రాంతాల్లో ఉన్న అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ల కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, పంచదార, నూనె, గోధుమ రవ్వతో కూడిన ప్యాకెట్లను 100మందికి ట్రస్ట్ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి వెంకుమహంతి చంద్రశేఖర్ మాట్లాడుతూ, సామాజిక సేవలో భాగంగా పేదలకు తమ వంతు సేవలు అందించేందుకు ఉన్నంతలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ ద నీడీ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు డాక్టర్ అప్పారావు, ఎల్.వినయ్‌కుమార్, బాగిరెడ్డి, పినపాల రామకృష్ణ (సినీ ఆర్టిస్ట్), రవీంద్ర, రాంప్రసాద్, వర్మ, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భైరవవాక కిటకిట

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానానికి అనుబంధమైన భైరవ స్వామి ఆలయానికి అమావాస్యను పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. సోమవారం వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో భైరవక ప్రాంతం కిటకిటలాడింది. అధికంగా భక్తులు తరలిరావడంతో రద్దీ ఏర్పడింది, రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. పోలీసులు, దేవస్థానం సిబ్బంది వెంటనే స్పందించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కిక్ బాక్సింగ్‌లో సింహాచలం చిన్నారి ప్రతిభ

ప్రజాశక్తి-సింహాచలం: ఆంధ్ర యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఉత్తరాంధ్ర కిక్ బాక్సింగ్ పోటీలలో సింహాచలం కాపు వీధికి చెందిన రాంబర్ని చంటి (అభిషేక్) ప్రతిభ చూపారు. ప్రహ్లాదపురం బాపు విద్యానికేతన్‌లో చదువుతూ ఆరిలోవ ఆంజనేయులు వాయుపుత్ర అకాడమీ కోచ్ అనిల్ కుమార్ పర్యవేక్షణలో శిక్షణ పొంది ఇటీవల జరిగిన కిక్ బాక్సింగ్‌లో మొదటి స్థానంలో నిలిచారు. తల్లిదండ్రులు శ్రీనివాసుసాయి, లక్ష్మి ఆనందం వ్యక్తంచేశారు. స్థానికులు అభినందనలు తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

జగనన్న ప్రగతిపథం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -మధురవాడ : రాష్ట్ర ఐటి వింగ్ ఆధ్వర్యాన జగనన్న ప్రగతి పథం పోస్టర్‌ను సోమవారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు కార్యదరి రవిరెడ్డి, నాయకులు అక్కరమాని వెంకటరావు, ఐటి వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మధు సంపత్, రవికాంత్, గిరిధర్, రాష్ట్ర కార్య దర్శి జగదీష్, జిల్లా ఐటి అధ్యక్షులు బొండ ఉమ, జోనల్ ఇన్‌ఛార్జి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : కార్తీక్ మాసం పూజా మహోత్సవానికి సంబంధించి రామలింగేశ్వర శివాలయం కార్యక్రమాల పోస్టర్‌ను ఉత్తర నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొడ్డేటి కిరణ్ కుమార్, ఇఒ రమాబాయి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమాజ నిర్దేశకులు జర్నలిస్టులు

వైసిపి పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆనంద్‌కుమార్

జర్నలిస్టులకు టపాసులు అందిస్తున్న గొలగాని, ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి-సీతమ్మధార : సమాజాన్ని నిర్దేశించేది జర్నలిస్టులేనని, జరిగేది, జరుగుతున్నదీ, జరగబోయేది చెబుతుంటారని సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్, పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వైజాగ్ జర్నలిస్ట్ ఫోరం (విజెఎఫ్) సభ్యులకు, విశాఖ పశ్చిమ నియోజకవర్గ జర్నలిస్టులకు పంపిణీ చేసిన బాణసంచా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల కుటుంబాలకు తన వంతుగా చిరు కానుకను అందించే అవకాశాన్ని కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. తాను నిత్యం జర్నలిస్టులతో మాట్లాడి విశేషాలు తెలుసుకుంటానని, ఎలమంచిలిలోని జర్నలిస్టులను పలకరిస్తూ ఏం జరుగుతోందని అడుగుతుంటానని చెప్పారు. గౌరవ అతిథి మేయర్ గొలగాని హరివెంకట కుమారి మాట్లాడుతూ, బాణసంచా పంపిణీ చేసి పండగను ఆనందంగా జరుపుకోవడానికి ఆనంద్ చేసిన కృషిని కొనియాడారు. జివిఎంసి పరిధిలో తాము చేపడుతున్న కాలుష్య నియంత్రణ కార్యక్రమాల్ని జర్నలిస్టులే ప్రపంచానికి తెలియజేస్తున్నారని చెప్పారు. జర్నలిస్టు నేతలు మాట్లాడుతూ, విజెఎఫ్ పాలకవర్గం లేనప్పటికీ ఈ కార్యక్రమం నిలిచిపోకూడదనే ఆలోచనతో ఆనంద్‌కుమార్‌ను కలవడంతో ఆయన స్పందించి అంగీకరించారని చెబుతూ ఆయనకు జర్నలిస్టుల కుటుంబాల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ నాయకులు ఆర్.రామచంద్రరావు, బి.రవికాంత్, మనభూమి సత్యనారాయణ, ధవళేశ్వరం రవికుమార్, జి.శ్రీనివాసరావు, కొయిలాడ పరశురాం, బొప్పన రమేష్, రామకృష్ణ, చందు, యువి.భాస్కరరావు, ఎస్‌విబి.కుమార్, త్రినాథ్, సుంకరి సూర్యం, బాలు, కోటి, మౌలానా, బంటయ్య, చంద్రమోహన్, గ్రేటర్ శ్రీనివాస్, రాజేష్, మహేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘నిందలు మానుకోవాలి’

పెద్ద చెరువు వద్ద నిరసన కు దిగిన సొసైటీ సభ్యులు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస – చిల్లపేట పెద్ద చెరువులో చేప పిల్లల పెంపకం కోసం మాంసకృత్తులతో కూడిన దాణా వాడడం వల్లనే దుర్వాసన వస్తుందంటూ తమ సొసైటీపై అవగాహన లేకుండా కొందరు నిందారోపణలు చేస్తుండడం మానుకోవాలని భీమిలి మండలం తాటితూరు స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు సింగిడి గణేష్, కార్యదర్శి అప్పలరాజు, సభ్యులు రవి హితవు పలికారు. చెరువు ద్వారా వెలువడుతున్న దుర్వాసనకు చేప పిల్లల పెంపకం కారణంగా కొంత మంది చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ సోమవారం చెరువు వద్దనే సొసైటీ సభ్యులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మంచి నీటి జాతికి చెందిన బంగారు పాప, బొచ్చు, ఎర్రమైల, రాగెండి వంటి జాతులు, చెరువులో ఉన్న గడ్డి, నాచు తింటాయని, వీటి ద్వారా దుర్వాసన ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఇవేవీ మాంసకృతులు తినే జాతి చేప పిల్లలు కాదని స్పష్టం చేశారు. ఈ తరహా తప్పుడు ప్రచారం వెనుక కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ ఆక్రమణదారులు ఉన్నట్లు అనుమానం కలుగుతోందని పేర్కొన్నారు. చెరువు సుందరీకరణ పేరిట కొంత మంది అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల చెరువులో మట్టి పేరుకుపోయి నీరు వెళ్లే మార్గం లేక అనివార్యంగా దుర్వాసన వస్తోందని తెలిపారు. తమ ఉపాధిని దెబ్బ తీసేలా ఎవరు ప్రయత్నించినా న్యాయ పరమైన చర్యలకు వెళ్తామని హెచ్చరించారు.



వినతులను పరిశీలిస్తున్న కెకె.రాజు

‘ఉత్తరం’లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటింకి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

శ్లాబ్‌పై శాంపిళ్లను సేకరిస్తున్న సిబ్బంది

అప్పన్న ఆలయ శ్లాబ్ శాంపిళ్ల సేకరణ

ప్రజాశక్తి-సింహాచలం : సింహాచలం దేవస్థానం ఆలయ ప్రధాన బేడా మండపం చుట్టూ ఉన్న శ్లాబ్‌ను తిరుపతి ఐఐటి ప్రొఫెసర్ ప్రశాంత్ సోమవారం పరిశీలించారు. శ్లాబ్ లీకుల శాంపిల్స్‌ను సేకరించారు. వాటిని పరిశీలన కోసం తీసుకెళ్లారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -పిఎం పాలెం : జోన్ – 3 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 11కెవి పెప్సీ ఫీడర్ మరమత్తుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పిఎం.పాలెం సబ్ స్టేషన్ ఎఇఇ మండల అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 45వ సచివాలయం పరిధిలో ఉన్న బాబా నగర్, విజేత సూపర్ మార్కెట్, కార్ షెడ్ ఏరియా తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

నేటి నుంచి నాటకాల పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి-సీతమ్మధార : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నాటకాల పుస్తకాలు, నాటకాల సాహిత్య పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేస్తున్నట్లు రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి, కన్వీనర్ నాగనబోయిన నాగేశ్వరరావు తెలిపారు. ద్వారకానగర్, రైల్వేస్టేషన్ రోడ్, టిఎస్ఆర్.కాంప్లెక్స్‌లోని రంగసాయి నాటక గ్రంథాలయంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఈ నాటకాల పుస్తక ప్రదర్శన ఉంటుందని వివరించారు. ప్రజలు, నాటక అభిమానులు, బాలబాలికలు, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

బాసుదేవ్ ఆచార్య మృతి

కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

సంతాప సభలో సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు, కార్మికోద్యమ నేత కామ్రేడ్ బాసుదేవ్ ఆచార్య మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి, ముఖ్యంగా సిపిఎంకు తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం హైదరాబాద్‌లో మరణించిన బాసుదేవ్ ఆచార్య సంతాప సభ సోమవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా బాసుదేవ్ ఆచార్య చిత్రపటానికి లోకనాథం, సీనియర్ నాయకులు గండి నాయనబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ బాసుదేవ్ విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో పాల్గొన్నారని, స్కూల్ టీచర్ ఉద్యోగాన్ని వదిలేసి సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా వచ్చారని తెలిపారు. 1980 నుండి 2009 వరకు 9 సార్లు పార్లమెంట్ సభ్యులు ఎన్నికయ్యారని, పలు కార్మికోద్యమంలో కీలకమైన పాత్ర పోషించారని పేర్కొన్నారు. రైల్వే, బొగ్గు కార్మికులకు అండగా నిలిచారన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లోనూ, బయట అనేక ఉద్యమాలు నిర్వహించారని, తుదిశ్వాస వరకు ఆయన నమ్మిన సిద్ధాంతం కోసం పరితపించారని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, అల్లు రాజు, నాయకులు కె.ఈశ్వరరావు, బి.ఉమామహేశ్వరావు, తేలయ్యబాబు, సిహెచ్.శివాజీ, ఎన్.రమణ ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

బాసుదేవ ఆచార్యకు నివాళులర్పిస్తున్న లోకనాథం, సిపిఎం నాయకులు

ఎంవిపి.కాలనీ : కార్మికోద్యమ నేత బాసుదేవ్ ఆచార్య మృతికి సిపిఎం విశాఖ జిల్లా కమిటీ సంతాపం ప్రకటించింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఓ ప్రకటన విడుదల చేశారు. అలాగే పార్టీ మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన బాసుదేవ్ ఆచార్య చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆ మహనీయుని సేవలను గుర్తుచేసుకున్నారు. బాసుదేవ్ బెంగాల్‌లో ఏడు దఫాలుగా పార్లమెంటుకు ఎన్నికయ్యారని, ట్రేడ్ యూనియన్ నాయకులుగా రైల్వే, ఇన్సూరెన్సు రంగాల ప్రత్యక్ష బాధ్యత చూశారని తెలిపారు. ఆయన మరణం దేశ కార్మిక వర్గానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్ఎల్ఎన్.శాస్త్రి, ప్రకాశరావు, పి.నారాయణమూర్తి, కృష్ణారావు, జివిఎన్.చలపతి, పి.మణి, పట్టాభి పాల్గొన్నారు.

గాజువాక : సిపిఎం మాజీ ఫ్లోర్ లీడర్, పార్లమెంట్ సభ్యులు బాసుదేవ్ ఆచార్య మృతికి సిపిఎం భెల్ యూనిట్ నాయకులు సంతాపం తెలిపారు. కార్మికులు, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం ఆయన కృషిచేశారని పేర్కొన్నారు. బిహెచ్‌పివిని భెల్‌లో విలీనానికి మొదటిసారిగా ప్రతిపాదించిన వారిలో ముఖ్యులు అని తెలిపారు. సంతాపం తెలియజేసిన వారిలో జిటిపి ప్రకాష్, ఎస్.జగన్నాధరావు, కె.విజయకుమార్, ఎస్.అప్పారావు, పి.కనకారావు, జి.అచ్చంనాయుడు, పి.శివరాం తదితరులు ఉన్నారు.

సిఐటియు సంతాపం

అనకాపల్లి : బాసుదేవ ఆచార్య మృతి కార్మిక వర్గానికి తీరని లోటని సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకర్రావు, జి కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులుగా పని చేశారన్నారు. విశాఖపట్నం బిహెచ్‌పివిని ఎల్ అండ్ టికి అప్పజెప్పే సందర్భంలో బాసుదేవ్ పిటిషన్ కమిటీ ఛైర్మన్ ప్రైవేటీకరణ కాకుండా నివారించారని గుర్తు చేశారు.

ఎంవిపి.కాలనీ : బాసుదేవ్ ఆచార్య మృతికి సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీశ్వరరావు

అధికారులు చట్టానికి లోబడి పని చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అఖిల భారత సర్వీసుకు చెందిన ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు చట్టానికి లోబడి పని చేయాల్సి ఉండగా, కొంత మంది ముఖ్యమంత్రి మెప్పుకోసం కట్టు బానిసలుగా మారిపోతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్తులో తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం వచ్చిన తర్వాత తప్పుడు పనులకు ప్రోత్సహించిన వారందరికీ శిక్ష తప్పదని హెచ్చరించారు. నిబంధనలను గుర్తించలేని జవహర్ రెడ్డిని ప్రధాన కార్యదర్శి పదవిలో ఉండటం దౌర్భాగ్యమన్నారు. అధికార దర్పానికి చిహ్నంగా ఉండాల్సిన అధికారులు ఒక రాజకీయ పార్టీకి బానిసలుగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, మండల స్థాయి కార్యాలయంలో వద్ద వైసీపీ జెండాలు ప్రభుత్వ సిబ్బందితో ఆవిష్కరించడం ఏమిటని ప్రశ్నించారు. దీనిని రాష్ట్ర గవర్నర్ చూసీ చూడనట్లుగా వ్యవహరించడం ఏమాత్రం న్యాయంగా లేదన్నారు. ముఖ్యమంత్రికి, ఆయన కుటుంబానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు పెడితే అరెస్టు చేయడమే కాకుండా వారి ఆస్తులు కూడా స్వాధీనం చేసుకుంటామని సిఐడి చీఫ్ సంజయ్ హెచ్చరించడం దేనికి సంకేతమన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు కడిమిశెట్టి నరసింగరావు, కోట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

రఘురాజును సత్కరిస్తున్న గొర్లి సూరిబాబు, మురళీకృష్ణ తదితరులు

జయహో జగన్ పాదయాత్రకు స్వాగతం

ప్రజాశక్తి-అనకాపల్లి : జయహో జగన్ పేరుతో విజయనగరం జిల్లా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేపట్టిన చలో తిరుమల పాదయాత్ర సోమవారం అనకాపల్లి చేరుకున్న సందర్భంగా వైసిపి నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రఘురాజు నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థాన చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఎంపీపీ గొర్లిసూరిబాబు ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమం దేవస్థానాల చైర్మన్లు కెఎం.నాయుడు, సకల రాజ్యలక్ష్మి గోవింద పాల్గొన్నారు.

కశింకోట : కసింకోట మండలం తాళ్లపాలెం గ్రామం వద్ద రఘురాజు పాదయాత్రకు సోమవారం వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అక్కడికి చేరుకుని రఘురాజును అభినందించారు. ఆయన పాదయాత్ర సాగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, జెడ్పిటిసి శ్రీధర్‌రాజు, ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు మలసాల కిషోర్, మళ్ళ గోపి, కొప్పాక, రామ గణేష్, గండి దేవుళ్ళు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని మారేపల్లి గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి మూడవ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అయ్యప్ప స్వామిలతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొని రూ.5 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కిల్లి గోవింద, నెక్కెళ్ళ శ్రీను, కిల్లి ముత్యాల నాయుడు, తమరాన పాత్రునినాయుడు, కిల్లి దేవుడి నాయుడు, కొటకల దేవుడి నాయుడు, కిల్లి అప్పలనాయుడు, పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

కార్మికులను తొలగించే విధానం సరికాదు

ఎండిఎం, శానిటేషన్ కార్మికుల నిరసన

నినాదాలు చేస్తున్న మిడ్డేమీల్స్, శానిటేషన్ కార్మికులు

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రభుత్వ స్కీమ్‌ల్లో పని చేస్తున్న కార్మికులను తొలగించి, వారికి అనకూలమైన వారిని నియమించుకునే విధానం దుర్మార్గమని, దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి అన్నారు. స్థానిక నూకాలమ్మ గుడి ప్రాంగణంలో ఎండిఎం, శానిటేషన్ కార్మికుల సమావేశం సోమవారం జరిగింది. అనంతరం రాజకీయ ఒత్తిళ్లతో కార్మికుల్ని ఇష్టారాజ్యంగా తొలగించడం అక్రమమని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ పనిభద్రత కల్పించాల్సిన ప్రభుత్వాలు, కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరు వల్ల అభద్రతా భావంతో పనిచేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతన చట్టం అమలు చేయకపోగా, ప్రమాదాలు సంభవించిన సందర్భాల్లో వైద్య ఖర్చులు కూడా ఇవ్వడం లేదని వాపోయారు. గ్యాస్ స్టవ్‌ల మీదే మధ్యాహ్న భోజనం తయారు చేయాలని చెబుతున్న ప్రభుత్వం తగిన గ్యాస్ సదుపాయం కల్పించడం లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీదేవి, జానకి, వరలక్ష్మి, పార్వతి, మండలంలోని కార్మికులు పాల్గొన్నారు.

నాటికల కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగు వారి జీవితాలను ప్రతిభింభించేవే నాటికలని ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) పేర్కొన్నారు. ఎలమంచిలి నియోజకవర్గ పరిధి తిమ్మరాజుపేట గ్రామంలో ఈనెల 17వ తేదీన నాగల చవితి సందర్భంగా నిర్వహించనున్న నాటికల ప్రదర్శనకు సంబంధించి కరపత్రాలను పట్టణంలోని నరసింగరావుపేటలోని ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎంవిఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సంబంధాలు కుటుంబ విలువలు వంటివి ఈ నాటికల ద్వారానే మెరుగుపడతాయన్నారు. యువత చెడు వైపు అడుగులు వేయకుండా ఉండేందుకు ఈ నాటికలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. ఇలాంటి నాటికలు, నాటకాలు పల్లెల్లో ఎక్కువగా ప్రదర్శింపబడతాయని, వీటి కొరకు ముందుకు వచ్చిన తిమ్మరాజుపేట గ్రామ ప్రజలను, నిర్వాహకులను ఎంవిఆర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం నిర్వాహకులు, తిమ్మరాజుపేట పెద్దలు, ఎంవిఆర్ ట్రస్ట్ సభ్యులు, సంజూ బాబు టీం పాల్గొన్నారు.

నాటికల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంవిఆర్ తదితరులు

దీర్ఘకాలిక వ్యాధులపై వైద్య శిబిరం

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో దీర్ఘకాలిక వ్యాధులపై ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. విజయవాడకు చెందిన ప్రముఖ న్యూర్యాలజిస్ట్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ ఆధ్వర్యంలో ఆరు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతి రెండు నెలలకు ఒకసారి రెండో ఆదివారం ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ మెడికల్ క్యాంపులో బీపీ, షుగర్, పక్షవాతం, పిట్స్ వంటి దీర్ఘకాలిక వ్యాధులపై నిపుణులైన వైద్యులతో ఉచితంగా పరీక్షించి రెండు నెలలకు సరిపడా మందులను అందించారు. డాక్టర్ డి.సాంబమూర్తి (రిటైర్డ్ సివిల్ సర్జన్ ఎన్టీఆర్ హాస్పిటల్ అనకాపల్లి), డాక్టర్ మీనేంద్ర కుమార్ (జనని హాస్పిటల్ అనకాపల్లి) పాల్గొని పేషంట్లకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.సాంబమూర్తి, డాక్టర్ మీనేంద్రకుమార్ మాట్లాడుతూ దీర్ఘకాలికమైన ఈ వ్యాధుల పేషెంట్లు క్రమం తప్పకుండా మందులను వాడాలన్నారు. రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రూ.200కే ప్రజా ఆరోగ్య వేదిక అందిస్తుందని చెప్పారు. ఈ క్యాంపుకు వచ్చేవారు ముందుగానే సుగర్ పరీక్షలు జరిపించుకొని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్స్ ఎస్.రాజు, బుగిడి నూకప్పారావు, కె.త్రినాథ్, స్టీల్ ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి శ్రీరామ్మూర్తి, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు, సిఐటియు నాయకులు ఆర్.శంకర్రావు, గంటా శ్రీరామ్, బ్యాంకు విశ్రాంత ఉద్యోగి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ప్రజారోగ్య వేదిక ప్రతినిధులు

కబ్జాకు గురైన గెడ్డవాగును పరిశీలిస్తున్న మాజీ మంత్రి బండారు

రూ.10 కోట్లు విలువైన గెడ్డవాగు కబ్జా

పరిశీలించిన మాజీ మంత్రి బండారు

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని ఇరువాడ రెవెన్యూ పరిధిలో రూ.10 కోట్లు విలువైన గెడ్డవాగును ఓ రియల్టర్ కబ్జా చేశారని గ్రామస్తులు ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి, టిడిపి పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు సత్యనారాయణమూర్తి సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ అనకపల్లికి చెందిన ఓ రియల్టర్ ఇరువాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 103, 106లలో ఉప్పుగెడ్డ వాగు, పోరంబోకు స్థలాలను కబ్జా చేసి, పక్కనే ఉన్న ప్రైవేట్ లేఔట్‌లో కలిపినట్లు గుర్తించామని చెప్పారు. ఈ ఉప్పుగెడ్డ ద్వారా ఇరువాడ గైరమ్మ చెరువుకు, అమృతపురం రాజుచెరువుకు నీరు వెళ్తుందని చెప్పారు. ఈ కబ్జాపై తహశీల్దార్ అధికార పార్టీ నాయకులకు తొత్తుగా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే దీనిపై చర్యలు తీసుకుని గెడ్డవాగు భూమిని పరిరక్షించాలని కోరారు. లేకుంటే జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గండి రవి కుమార్, కొటాన అప్పారావు, రేసుపూడి రమణ, కరణం రాముునాయుడు, గవర సత్యనారాయణ, ఉప సర్పంచ్ బలిరెడ్డి సూర్య ప్రసాద్, బలిరెడ్డి అప్పారావు, గుజ్జ శ్రీనివాసరావు, కోరాడ శ్రీనివాసరావు, రావర్తి బాబూరావు, వాకాడ కనకరాజు, క్రి సోమునాయుడు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న షేక్ రెహమాన్

15 మందికి దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట

మండలం నరిశింగబిల్లి గ్రామంలో 15 మందికి దీపావళి సందర్భంగా ఆదివారం వైసిపి చింతలపాలెం గ్రామ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ (శీను) ఆర్థిక సహాయంతో దుప్పట్లు పంపిణీ చేశారు. వీటిని ఎన్‌పిఆర్‌డి మండల నాయకులు షేక్ రెహమాన్ చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ బాబూరావు, వికలాంగులు పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-దేవరాపల్లి

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల స్త్రీ నిధి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు తారువలోని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేసి మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏజిఎమ్ ధర్మేంద్ర, కోశాధికారి రమణ, కార్యవర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు, సునీత, శశి కుమార్ వివిధ జిల్లాల సీనియర్ ఏజీఎమ్‌లు పాల్గొన్నారు.

జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

జమ కాని రైతు భరోసా?

బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

రైతులకు వ్యవసాయం పెట్టుబడుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద ఇస్తున్న రూ.2వేలు రైతులు ఖాతాల్లో ఇంకా జమ కాలేదు. ఈనెల 7న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అట్టహాసంగా అనంతపురం జిల్లా పుట్టపర్తిలో రైతు భరోసా విడుదలకు బటన్ నొక్కారు. వారం రోజులు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో మాత్రం నగదు జమ కాలేదు. దీంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అనకాపల్లి జిల్లాలోని రైతాంగానికి రూ.109.77 నిధులు రైతుల ఖాతాల్లో జమైనట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటించారు. బుచ్చయ్యపేట మండలంలోని 35 గ్రామపంచాయతీలో సుమారు 25 వేలకు పైగా రైతులు భూములను సాగు చేస్తున్నారు. వీరంతా ప్రభుత్వం విడుదల చేసినట్లు ప్రకటించిన నగదు జమైందో లేదో నన్న ఆత్రుతతో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. కానీ నేటి వరకు రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదు. వ్యవసాయ పెట్టుబడులకు నగదు లేక ప్రభుత్వ సహాయం ఉపయోగపడుతుందని ఆశతో ఎదురుచూసిన రైతులకు నిరాశ మిగిలింది.

ఇంకా డబ్బులు పడలేదు

గ్రామంలో రెండు ఎకరాలకు పైగా భూమిని సాగు చేస్తున్నాను. ప్రభుత్వం రైతుభరోసా నగదును విడుదల చేసినట్లు ప్రకటించడంతో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నాను. కాని డబ్బులు పడలేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారు.

- కందమూర్తి రావు, రైతు, తురకలపూడి

ఎవి.రమణరావుకు నివాళి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ప్రజా సమస్యలపై ఎవి.రమణరావు నిరంతరం కృషి చేసారని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ కొనియాడారు. రమణరావు తృతీయ వర్ధంతి సభ మద్దిలపాలెం కళాభారతి వద్దనున్న సిపిఎం కార్యాలయంలో పార్టీ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ముందుగా రమణరావు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం జరిగిన సభలో శర్మ మాట్లాడుతూ రమణరావు పీర్‌లెస్‌లో ఉద్యోగిగా చేరి అందులో పనిచేసేవారి సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేశారన్నారు. ప్రైవేటీకరణ ఊపుందుకున్న నేపథ్యంలో పీర్లెస్‌ను ప్రభుత్వ రంగంలో జాతీయం చేయాలని పెద్దఎత్తున దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమానికి నాయకత్వం వహించారని గుర్తుచేశారు. విశాఖ నగరంలో ప్రభుత్వం విధించిన ఆస్తి పన్ను, చెత్త పన్ను, డ్రైనేజ్, బిల్డింగ్ పీనలైజేషన్ పన్నువంటి వాటిపై ఉద్యమించారన్నారు. మధ్య తరగతి ప్రజలను ఐక్యం చేసేందుకు వార్డు వేదికను ఏర్పాటు చేశారన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు సాహితీవేత్తలను కూడగట్టారని తెలిపారు. నేటి ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించడమే రమణరావుకు నిజమైన నివాళి అన్నారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్‌ఎల్‌ఎన్.శాస్త్రి, ప్రకాశరావు, పి.నారాయణమూర్తి, జివిఎన్.చలపతి, పి.మణి, పట్టాభి పాల్గొన్నారు.

రమణరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

అనకాపల్లి : పీర్లెస్ యూనియన్ రాష్ట్ర నాయకులు, వార్డు ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి ఎవి.రమణారావు మూడవ వర్ధంతి సోమవారం స్థానిక దొడ్డి రామనాయుడు భవనంలో జరిగింది. రమణారావు చిత్రపటానికి పీర్లెస్ యూనియన్ నాయకులు కాళ్ల తేలయ్య బాబు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ పూలమాలలవేసి నివాళి లర్పించారు. ఈ సందర్భంగా తేలయ్య బాబు మాట్లాడుతూ పీర్లెస్ ఉద్యోగుల సమస్యలపై రమణారావు నిరంతరం కృషి చేశారన్నారు. పట్టణాల్లో అపార్ట్మెంట్ వాసుల సంఘం నాయకుడిగా, సాహితీ స్రవంతి రంగంలో రమణారావు సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, కోశాధికారి వివి.శ్రీనివాసరావు, వార్డు అనకాపల్లి జిల్లా కన్వీనర్ ఉమామహేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

'భవిష్యత్ గ్యారెంటీ'పై ప్రచారం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని కరక గ్రామంలో బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీపై ప్రచారం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ భవిష్యత్తు గ్యారెంటీ పథకంలో భాగంగా మహిళలకు, వ్యవసాయదారులకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు ప్రయోజనకరంగా ఉండే మేనిఫెస్టోను ప్రకటించినట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, నాయకులు కోరుకొండ రవికుమార్, సాయం శేషు, కోరుకొండ సత్యారావు, గొన్నాబత్తుల శ్రీనివాసరావు, శిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : టీడీపీ అధికారంలోకి రాగానే ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి రహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే టీడీపీ, జనసేన లక్ష్యమని చెప్పారు. స్థానిక గవరపాలెం 81వ వార్డు కస్పా వీధి, మళ్ల దొడ్డి ప్రాంతాలలో సోమవారం రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్ మళ్ల సురేంద్ర ఆధ్వర్యంలో జరిగిన భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే హాజరై ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేగి కృష్ణ, మారిశెట్టి శంకర్రావు, దాడి బుజ్జి, అనకాపల్లి రాము, ఎండపల్లి శేఖర్, క్రి మహాలక్ష్మి నాయుడు, నంద్యాల గణేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని ఉద్దండ పురం గ్రామంలో సోమవారం తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసే పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు వైబోయిన రమణ, కాశీ, తుమ్మల వెంకటరమణ, వీరబాబు, కొంతం రమణ, వెలగా శ్రీను, వంగలపూడి రమణ, మహేష్ పాల్గొన్నారు .

ఎస్.రాయవరం : మండలంలో వోమ్మవరం గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం గ్రామంలో ఇంటింటికి వెళ్లి చంద్రబాబుతోనే ఆంధ్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ అంటూ టీడీపీ మినీ మెనిఫెస్టోలో పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పల్లెల బుజ్జి, కొండలరావు, ఐటిడిపి మండల ప్రధాన కార్యదర్శి సత్తిబాబు పాల్గొన్నారు.

బోనులో బంధించిన కోతులు

కోతుల సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

కొంతకాలంగా అనకాపల్లి మండలం కొత్తూరు, మునగపాక మండలం ఉమ్మలాడ గ్రామాల్లో రైతులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కోతుల గుంపును ఎట్టకేలకు బంధించి తరలించారు. ఈ సందర్భంగా వైసిపి మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదేశాలతో అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ సహకారంతో సుమారు మూడు లక్షల వ్యయంతో ఉమ్మలాడ, కొత్తూరు గ్రామాలలో సుమారు 250 కోతులను రాజమండ్రి అగ్గి రాముడు బృందం చేత బంధించినట్లు చెప్పారు. వీటిని అటవీ ప్రాంతానికి తరలిస్తున్నట్లు తెలిపారు.

నూకాంబిక ఆలయ అభివృద్ధికి మరిన్ని చర్యలు

ప్రజాశక్తి- అనకాపల్లి

శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయం అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపడుతున్నట్లు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారి ప్రసాద్ తెలిపారు. చైర్మన్ అధ్యక్షతన తన ఛాంబర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అమ్మవారి గుడి నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలకు ఉచిత వసతి, ప్రత్యేక దర్శనం కల్పించాలని సూచించారు. ప్రస్తుతం భక్తులు ఉపయోగించే టాయిలెట్లను ఆధునీకరించాలని తీర్మానిస్తూ.. దాని నిమిత్తం 3 లక్షలు విరాళం అందజేసిన ఎన్‌డి గ్రూప్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్‌కి అభినందనలు తెలియజేశారు. దేవాలయం నైరుతి మూల రహదారి పక్కన ప్రసాదం కౌంటర్ ఏర్పాటు చేయడానికి తీర్మానించారు. దాతలు బొడ్డేడ శ్రీనివాసరావు, మల్ల శ్రీనివాసరావు, మల్ల శేషు తదితరుల సహకారంతో అమ్మవారికి పూజలు నిర్వహించి 1500 మందికి అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బుద్ధ నర్సింగరాజు, పీలా లక్ష్మి శ్రీనివాసరావు, ఆడారి ఉమా శ్రీనివాసరావు, కొండూరి రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ సన్నిబాబు, కంటపల్లి శోభారాణి వెంకటరావు, మల్లవరపు ఈశ్వరరావు, అర్చకులు యనమండ్ర శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని టిడిపి, జనసేన పార్టీల ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జులు ప్రగడ నాగేశ్వరరావు, సుందరపు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. అచ్యుతాపురంలో సోమవారం ఎస్‌కెఆర్ ఫంక్షన్ హాల్‌లో టిడిపి జనసేన పార్టీ నాయకులు సమావేశమయ్యారు. రెండు పార్టీలకు చెందిన కార్యకర్తలు మంగళవారం అచ్యుతాపురంలో జరుగు సమావేశానికి ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగరావు, జనసేన మండల అధ్యక్షులు బైలపూడి రామదాసు, మాజీ జెడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఎన్.నరసింగరావు, లాలం రాజు, కూనిశెట్టి రమణ, ఎంద్ర అప్పలనాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న టిడిపి, జనసేన నాయకులు

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- సిసి కెమెరాల ఏర్పాటు - ఎస్‌పి కెవి.మురళీకృష్ణ

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్‌పి కెవి మురళీకృష్ణ తెలిపారు. సోమవారం సాయంత్రం అడ్డురోడ్డులోని నక్కపల్లి సర్కిల్ కార్యాలయంను సందర్శించిన ఆయన పలు అంశాలపై స్థానిక విలేఖరులతో మాట్లాడారు. జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు ఆయా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ సిబ్బందికి సూచనలిచ్చామన్నారు. జిల్లాలో గతేడాది అక్టోబర్ నుండి ఈ ఏడాది అక్టోబర్ వరకు 24శాతం ప్రమాదాలు జరగకుండా నివారించామన్నారు. డ్రంక్ అండ్ డ్రయివ్ కేసుల్లో 70శాతం పైనే కేసులు నమోదయ్యాయన్నారు. అవసరమైన చోట సిసి కెమెరాల ఏర్పాటుకు ఆదేశాలిచ్చామన్నారు. జిల్లాలోని ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను ఇప్పటికే సందర్శించామన్నారు. స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ, వెలుతురు సరిగా లేని ప్రాంతాలలో లైటింగ్ ఏర్పాట్లు చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించామన్నారు. రాంగ్ రూటులో వచ్చే వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు కఠిన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించామన్నారు. రౌడీషిటర్ల పై మరింత నిఘా పెట్టాలని సూచించారు. ఆయన వెంట నక్కపల్లి సి ఐ అప్పన్న బాబు, నక్కపల్లి యస్‌ఐ విభీషణరావు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి

వెంకన్న దర్శించుకున్న ఎస్పీ

నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ను సోమవారం ఎస్పి మురళీకృష్ణ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.వెంకన్న జ్ఞాపిక ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎస్పీ నక్కపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు సూచనలు చేశారు.

కవగుంటలో అందని పింఛన్లు

-పట్టించుకోని సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి -రావికమతం:సచివాలయ సిబ్బంది నిర్వాహకంతో మండలంలో కవగుంట గ్రామంలో ఐదుగురు పింఛనుదారులకు ఈనెల పింఛను సొమ్ముకు అందలేదు. మండలంలో కొమిర సచివాలయ పరిధిలో కవగుంట గ్రామపంచాయతీలో నలుగురు వృద్ధులు, ఒక వికలాంగుడుకి పింఛను అందక పోవడంతో సర్పంచు దాసరి సూర్యకుమారి, సచివాలయ కన్వీనర్ దాసరి వరహాలు వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సచివాలయ సిబ్బందిని సర్పంచు అడిగి తెలుసుకోగా వీరికి పింఛన్లు అందలేనట్లు తెలిపారు. వాలంటీర్ను అడగగా తమ లాగిన్ లో వచ్చిన పెన్షన్లన్నీ కూడా పంపిణీ చేయడం జరిగిందని, వెల్ఫేరు, సచివాలయ సిబ్బంది ఇవ్వవలసిన పెన్షన్లు మాత్రమే ఉండిపోయాయని తెలిపారు.

గ్రామానికి చెందిన బీరా బాపనమ్మ, బొట్ట చిన్న తల్లి, దాసరి నూకాలమ్మ, శానాపతి కొండమ్మలు వృద్ధాప్య పింఛన్లు కాగా రబ్బా సత్తిబాబు వికలాంగు పిచను అందలేదు. నెలకు ఒకమారు అందించే పెన్షన్ అందక పోవడంతో లబోదిబోమంటున్నారు. తమ ఐదుగురి పెన్షన్స్ సచివాలయ సిబ్బంది లాగిన్‌లో ప్రతినెలా వచ్చి ఇస్తున్నారన్నారు. ఈనెల సచివాలయ సిబ్బంది రాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా 1వ తేదీనే పెన్షన్ సొమ్మును గ్రామాలకు పంపిస్తే ఆ సొమ్మును ఇవ్వక పోవడం బాదాకరమన్నారు.సచివాలయం సిబ్బంది కనీసం గ్రామం వైపు కన్నెత్తి చూడకపోవడం చాలా దారుణమన్నారు. పింఛను సొమ్మును చెల్లించాలని, లేనిపక్షంలో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని సర్పంచ్ హెచ్చరించారు. కొమ్మెర సచివాలయ సిబ్బంది సరిగా పనిచేయలేదని, అధికారులకు ఇదివరకే తెలియపరచడం జరిగిందన్నారు. అయినప్పటికీ వారి పనితీరులో ఎటువంటి మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న వికలాంగుడు

గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-అరకులోయ:ఈనెల 15న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అరకులోయలో పర్యటించనున్న నేపథ్యంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన అరకులోయలో మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మూడు వాహనాలు ఏజెన్సీ పర్యటిస్తాయని చెప్పారు. సంస్కృతి, సాంప్రదాయాలపై కార్నివాల్ నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఘనంగా చిట్టిబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:పాయకరావుపేట టీడీపీ మండలం అధ్యక్షులు, తుని నియోజకవర్గ పరిశీలకులు పెద్దిరెడ్డి చిట్టిబాబు జన్మదిన వేడుకలు పాయకరావుపేటలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకులకు రాయవరం మండలం నుండి పలువురు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఐటీడీపి అధ్యక్షులు భీమర శెట్టి శ్రీనివాస్, మల్లిపెద్ది సతీష్, రమేష్, లోవరాజు, శ్రీనివాస్ వంశీ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

శిథిల వంతెనపై భారీ వాహనాలు

-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో జల్లూరు వరహా నదిపై శిథిలావస్థకు చేరుకున్న వంతెన పైనుంచి సుమారు 40 టన్నుల బరువు ఉన్న భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలు, వాహనదారులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో 2014లో పాత వంతెన పైనుంచి రాకపోకలు నిషేధించి సుమారు 50 లక్షలు వెచ్చించి డైవర్షన్ రోడ్డు సైతం ఏర్పాటు చేసి వాహనాలు దారి మళ్లించారు. అది కూడా మూడు నాళ్ల ముచ్చట కావడంతో డైవర్షన్ రోడ్డు నీటిపాలైంది. అనంతరం మంజూరైన వంతెన పనులు దాదాపు పూర్తి కావచ్చినా అప్రోచ్ రోడ్ల నిర్మాణం పనుల వద్ద ఆగి పోవడంతో వాహనాలు యధావిధిగా పాత వంతెన పైనుంచి ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో గోతుల మయం కావడంతో వాహనాలు వెళ్ళేటప్పుడు వంతెన ఊగి పోతోంది. నర్సీపట్నం వెళ్లే స్కూల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంతెన పై నుంచి వెలుతున్న వాహనాలు

వేలాడుతున్న కరెంట్ తీగలు

ఇళ్లపై వేలాడుతున్న కరెంట్ తీగలు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో రత్నంపేట గ్రామంలోని బిసి కాలనీలో ఇళ్లపై కరెంట్ లైన్ ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుం దోనని కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. ా ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు. గతంలో రెండు సార్లు వైర్లు తెగిపడిపోయాయన్నారు. కింతతాడ అర్జునమ్మ కాలనీ ఇల్లు మంజూరు కాగా లెంటల్ లెవెల్ వరకు నిర్మాణం జరిపి శ్లాబ్ వేయుటకు అడ్డంగా ఉండటంతో నిర్మాణంకు ఆటంకంగా మారింది. ఇప్పటికైనా స్పందించి ఎలక్ట్రికల్ లైన్లు సరి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పందూరు గ్రామ ముఖద్వారం

టిడిపికి నాయకత్వలోటు!

అధికంగా ఓట్లు ఉన్నా దిక్కులు చూస్తున్న పందూరు నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి -కోటవురట్ల: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలలోనూ విస్తరించి ఉన్న టిడిపి పార్టీ నాయకత్వం మండలంలో పందూరు గ్రామంలో మాత్రం నాయకత్వ లేమితో కొట్టుమిట్టాడుతోంది. గ్రామంలో ఓట్లు విస్తారంగా ఉన్నా వాటిని లీడ్ చేసే నాయకుడు లేక క్యాడర్ దిక్కులు చూస్తుంది. కొన్ని సందర్భాలలో కేడర్ను ప్రలోబపెట్టి గ్రామంలో అధికార పార్టీ నాయకులు పెత్తనం చలాయిస్తున్నా అడిగే నాయకుడు లేడు.గతంలో ఇక్కడ అనేకసార్లు సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను గెలుచుకున్నా నాయకత్వం లేని కారణంగా ప్రస్తుత అధికార పార్టీ నాయకులు పెత్తనం చేపట్టడం విశేషం. గ్రామంలో సుమారు 1600 ఓట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఎంపీటీసీ సభ్యుడిగా తెలుగుదేశం పార్టీ నాయకుడే ఉన్నా పార్టీ బలోపేతానికి కృషి చేయలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో ఇటీవల ప్రభుత్వం అసైన్డ్ భూముల చట్టబద్ధతపై ప్రకటన చేసింది. ఈ విషయంలో పెద్ద ఎత్తున రైతుల పేర్లు, మార్పులు వంటివి జరుగుతున్నా అడిగే నాధుడే కరువయ్యాడు. ప్రధాన సమస్య పొందూరు వంతెన గురించి పట్టించుకున్న నాధుడే లేడు. గ్రామంలో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నా నిరదీసే వారు లేక ఇస్తారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటువంటి సందర్భంలో గ్రామంపై టిడిపి నాయకులు దృష్టి సారించి క్యాడర్‌కి భరోసా ఇచ్చే నాయకుడిని కనీసం ఇన్చార్జిగా నైనా నియమించాలని పొందూరు గ్రామ టిడిపి కార్యకర్తల కోరుతున్నారు.

ఆలయాలు ముస్తాబు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాకలో లక్ష్మనేశ్వర స్వామి ఆలయంలో లక్షణేశ్వర స్వామి (శివాలయం) ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వర రావు అర్చకులు మహేష్ తెలిపారు.మంగళవారం నుండి కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయానికి రంగులు వేసి, విద్యుద్దీకరణ చేపట్టారు. క్యూ లైన్లు ఏర్పాటు చేశారు.

ముస్తాబైన శివాలయం

ప్రజా రక్షణ భేరికి తరలిరండి

అచ్యుతాపురంలో చేపడుతున్న బైక్ ర్యాలీ

ప్రజాశక్తి -అనకాపల్లి:అసమానతలు లేని రాష్ట్ర అభివృద్ధి కోసం మూడు ప్రాంతాల నుంచి జరిగిన బస్సు యాత్ర ముగింపు సందర్భంగా విజయవాడలో ఈనెల 15న జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభకు తరలిరావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పిలుపునిచ్చారు. బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీని లోకనాథం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ బైక్‌ర్యాలీ ఆర్టీసీ కాంప్లెక్స్, నెహ్రూచౌక్, రామచంద్ర థియేటర్, పార్క్ సెంటర్, అగ్గి మర్రి చెట్టు మీదుగా తిరిగి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు జరిగింది. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ కేంద్ర బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికొదిలేశాయని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంటా శ్రీరామ్, జి.కోటేశ్వరరావు, ఆర్ శంకరరావు, జి నాయిన బాబు, ఏ రాజు, సిహెచ్.శివాజీ, బి.ఉమామహేశ్వరరావు, కె.తేలయ్యబాబు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : విజయవాడలో జరుగు సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం అచ్యుతాపురంలో బైక్ ర్యాలీ చేశారు. ఈ ర్యాలీని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. మోసయ్యపేటలో ప్రారంభమై రామన్న పాలెం, ఎదురువాడ, అచ్యుతాపురం మీదుగా స్థానిక నాలుగు రోడ్ల వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.రాము, కె.సోమునాయుడు, రామ్‌కుమార్, దారబాబు, గురు నాయుడు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం

మునగపాక రూరల్ : ప్రచారక్షణ బేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు మునగపాక మండల కేంద్రం సోమవారం వ్యాపార కేంద్రాలు, ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వివి.శ్రీనివాసరావు, ఎస్.బ్రహ్మాజీ, టెక్కలి జగ్గ అప్పారావు, పెంటకోట రఘు కిషోర్, ఆడారి సాంబశివ పాల్గొన్నారు.

ప్రజా రక్షణ సభను విజయవంతం చేయాలి.

సబ్బవరం : ఈ నెల15 న విజయవాడ బహిరంగ సభకు తరలిరావాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి ఆధ్వర్యాన ప్రచారం చేశారు. స్థానిక దుర్గమాంబ ముఠా కార్మికులతో సమావేశమై మాట్లాడారు. అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరవాడ : సిపిఎం బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను పరవాడ మండలంలోని లంకలపాలెంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం దుకాణాలకు వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గనిశెట్టి సత్యారాయణ, కర్ణం వెంకట్రావు, పి గంగరాజు, శ్రీను, పి అప్పారావు పాల్గొన్నారు.

గాజువాకలో కవాతు నిర్వహిస్తున్న వాలంటీర్లు .

నక్కపల్లి:విజయవాడలో ఈనెల15న జరగనున్న సిపిఎం బహిరంగ సభ జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు కోరారు.మండలంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో సోమవారం బహిరంగ సభకు సంబంధించిన గోడపత్రికలను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణభేరి ముగింపు సందర్భంగా 15న విజయవాడ లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం.రాజేష్ తదితరులు పాల్గొన్నారు .

రోలుగుంట:విజయవాడలో ఈ నెల 15న జరిగే ప్రజా రక్షణ భేరి సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు పిలుపునిచ్చారు. సోమవారం రోలుగుంట మండలం రత్నంపేట పంచాయతీ పనసపాడు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం గోవిందరావు మాట్లాడుతూ, గిరిజన భూముల రక్షణ కోసం, అసమానతలు లేని అభివృద్ధి కోసం జరిగే ప్రజారక్షణ భేరి సభకు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రోలుగుంటలో ప్రచారం చేస్తున్న గోవిందరావు

కలెక్టరేట్ : ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న విజయవాడలో జరుగుతున్న ప్రజారక్షణ భేరి బహిరంగ సభకు ప్రజానీకం పెద్దఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ తరగతుల ప్రజల సమస్యలపై ఇప్పటికే ప్రజారక్షణభేరి పేరిట మూడు బస్‌యాత్రలు అక్టోబరు 30 నుంచి సాగాయన్నారు. దీనికి ముగింపుగా ఈ నెల 15న ఉదయం 10 గంటలకు విజయవాడ బిఆర్‌టిఎస్ ఫుడ్ జంక్షన్ నుంచి ఎంబి స్టేడియం వరకు భారీ ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ ఉంటాయని తెలిపారు. సభలో పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, తదితరులు పాల్గొంటారన్నారు.

రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు

గాజువాక : విజయవాడలో ఈ నెల 15వ తేదీన జరగనున్న ప్రజారక్షణభేరి సభను జయప్రదం చేయాలని కోరుతూ గాజువాక సిఐటియు కార్యాలయంలో రెడ్‌షర్ట్ వాలంటీర్లు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాజువాక జోన్ నాయకులు ఎం.గుణశంకర్, డి.సాయికుమార్, బి.తేజ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలోని వరహాపురం హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కత్తి సాము పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో కత్తి సాము పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన పడాల ఊర్మిల, బద్ది లలిత, విసారపు కృష్ణవేణి, పి.రూపేష్, పడాల హర్షవర్ధన్, సిరసపల్లి గౌతమ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపిక య్యారని పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు సింహాచలం తెలిపారు. రాష్ట్ర స్థాయి కత్తి సాము పోటీలు ఈనెల 15, 16, 17 తేదీల్లో కర్నూలు జిల్లా నంద్యాలలో జరుగు తాయి. విద్యార్థులను వైస్ ఎంపీపీ స్వాతి, సర్పంచ్ చిన్నమ్ములు, మండల వైసీపీ కన్వీనర్ గొల్లపల్లి రాజుబాబు, ప్రధానోపాధ్యాయులు వరహామూర్తి అభినందించారు.

విద్యార్థులతో ఉపాధ్యాయులు

రంధ్రం పడిన చోట ఉంచిన ముళ్ల కంపలు

కల్వర్టుకు రంధ్రం

- ఆందోళనలో వాహనదారులు

ప్రజాశక్తి-రోలుగుంట:చోడవరం నుంచి నర్సీపట్నం వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డు కొత్తకోట గజాలకట్టులో కల్వర్టుకు రంధ్రం పడటంతో ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డుపై 40 నుంచి 50 టన్నుల బరువు గల లారీలు వెళుతుంటాయి. క్వారీ లారీలు, సరుగుడు కర్రలతో వెళుతున్నాయి. దీంతో, ఎప్పుడు ఏమి జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కల్వర్టుకు మే నెలలో మట్టి తొలగించారు. ఆ తర్వాత పూర్తిగా జేసిబితో మూసివేయడం జరిగింది. ఈ కల్వర్టు నుండే సాగునీరు కంచుగుమ్మల రెవెన్యూ పరిధిలోని రోడ్డు అవతల పొలాలకు పారుతోంది. అధికారులు దీనిపై దృష్టి సారించి కల్వర్టు రంధ్రం పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

సరుకులు అందజేస్తున్న అప్పలరాజు, బంగారయ్య

బాధితులకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో బాధితులను ప్రముఖ వైద్యులు బంగారయ్య పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే మాజీ సర్పంచ్ వెదుళ్ల బంగారి, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజు, లోవరాజులు బాధితులను పరామర్శించారు.

మాజీ ఎమ్మెల్సీ లక్ష్మి శివకుమారి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి 10వేలు" ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ యువ నాయకులు లింగంపల్లి జ్యోతి కుమార్, రాంబాబు, ధర్మవరం గ్రామ జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-యస్.రాయవరం:అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు సూచించారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల చెడ్డీ గ్యాంగ్ పేరుతో ఒక ముఠా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. కొద్దిరోజుల క్రితం తిరుపతిలో కూడా ఈ ముఠా కదలికలు సిసి ఫుటేజ్ లో కనిపించడం జరిగిందని తెలిపారు. మన జిల్లాలో కూడా ఈ ముఠా నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. రాత్రి పూట ఇళ్ల తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడటం ఈ ముఠా ప్రత్యేకత అన్నారు. రాత్రి వేళల్లో ఎవరైనా అపరిచితులు తలుపులు కొడితే ఒకటికి పదిసార్లు చూసుకోవాలన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే ఫోన్:9440796107, 100 నంబర్ కి కాల్ చేయాలని సూచించారు.

సూక్ష్మ కళాకారుని ప్రతిభ

చెక్కతో బాలల ఆకృతులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చిన దొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారులు దార్ల రవి తన సూక్ష్మకళ తో అబ్బురు పరుస్తున్నాడు. నవంబర్ 14న బాలల దినోత్సవ సందర్భంగా బాలలు ఆడుతున్నట్లుగా చెక్క పై చెక్కి తన సూక్ష్మ కళను ఆవిష్కరించాడు. బాలల దినోత్సవం సందర్భంగా బాలలకు తన సూక్ష్మకళతో శుభాకాంక్షలు తెలియజేశాడు.

పట్టాలివ్వాలని నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట కోళ్ల ఫారం ఎస్సీ లబ్ధిదారులకు తక్షణమే పట్టాల మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వైఎస్ఆర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దళిత బహుజన శ్రామిక సంఘం జిల్లా అధ్యక్షులు మల్లేటి రాజు మాట్లాడుతూ, గత 35 కింద దళితులకు సుమారు 20 మందికి జీవన ఆధారం కోసం కోళ్ల పెంపకం షెడ్డులు నిర్మాణం చేసారని తెలిపారు. నష్టాల కారణంగా కోళ్ల పెంపకం నిలిచి పోయిందని రాజు వివరించారు. తమకు కేటాయించిన స్థలానికి నేటికీ హక్కు కల్పించ లేదన్నారు. పలు మార్లు అధికారుల దృష్టి కి తెలిపినా పరిష్కరించలేదని ఆరోపించారు. రెండేళ్ల కింద చోడవరం ఎమ్మెల్యే కు వినతిపత్రం ఇవ్వగా రెవెన్యూ అధికారులకు సిఫార్స్ లెటర్ ఇచ్చారని పేర్కొన్నారు. ఇంత వరకూ రెవెన్యూ అధికారులు స్పందించ లేదని చెప్పారు.అంతకు ముందు వైఎస్ ఆర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కోళ్ల ఫారం లబ్ధిదారులు చెక్క రాజారావు, నాగు, మల్లేటి రాజా, గెడ్డం శ్రీను, బుంగా లోవరాజు, పూడి సత్తిబాబు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న బాధిత లబ్ధిదారులు

జనసేన నేతల సమావేశం

ప్రజాశక్తి -గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేటలో సఖి రెడ్డి మణిబాబు అధ్యక్షతన జనసేన గొలుగొండ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మణిబాబు మాట్లాడుతూ,రాబోయే రోజులలో జనసేన, టిడిపి కలిసి పని చేయాలన్నారు. 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఎన్నికల్లో గెలుపునకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం జనసేన పార్టీ మండల అధ్యక్షుడిగా దుంపలపూడి సహదేవుడు, ప్రధాన కార్యదర్శిగా లంక సత్యనారాయణను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముప్పిన రామకృష్ణ, పాతాళ శివ, చెల్లూరి గుణశేఖర్ పాల్గొన్నారు.